కావలి వెంకట రామస్వామి

# దక్కన్ కవుల జీవిత చిత్రాలు

భారత ద్వీపకల్పంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన సువిఖ్యాతులైన
ప్రాచీన, ఆధునిక కవుల జీవిత చిత్రాలు

**వెల్చేరు నారాయణరావు పీఠికతో**

---

**అనువాదం**

**డా. ఎ.వి. పద్మాకర రెడ్డి**

ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ తో

ఎమెస్కో

# కావలి వెంకట రామస్వామి

– డా. సి.వి. రామచంద్రరావు

## 1. కావలి సోదరులు

కావలి వెంకటరామస్వామి దక్కను కవుల జీవిత చిత్రాలు (Bio- Graphical Sketches of the Deccan Poets) రచయిత. కావలి సోదరులుగా తర్వాతి కాలంలో ప్రసిద్ధులైన పండిత సోదరులలో మూడోవాడు. తక్కిన ఇద్దరూ రామస్వామి కంటే పెద్దవాళ్లు. వీరు కావలి వెంకట బొర్రయ్య, కావలి వెంకట లక్ష్మయ్య.

కావలి సోదరులు 18వ శతాబ్ది చివరి పాదంలోనూ, 19వ శతాబ్ది మొదటి మూడు పాదాల్లోనూ వర్ధిల్లారు. బొర్రయ్య 1776–1803 నడుమ జీవించాడు. లక్ష్మయ్య, రామస్వామిల జన్మ, మరణ తేదీలు మనకు తెలియవు. ముగ్గురు సోదరులు నేటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పశ్చిమ గోదావరి జిల్లా ముఖ్యపట్టణం ఏలూరుకు చెందినవారు. వీళ్ల తండ్రి ఏలూరుకే చెందిన కావలి వెంకట సుబ్బయ్య.

ఈ ముగ్గురు సోదరులూ క్రైస్తవ మిషనరీ పాఠశాలల్లో ఇంగ్లీషుకు ప్రాధాన్యం ఉన్న చోట ఉన్నత పాఠశాల విద్య నభ్యసించారు. యుక్త వయస్సు వచ్చేనాటికి ఇంగ్లీషులో ధారాళమైన ప్రావీణ్యం గడించారు. ముగ్గురూ కూడా బహుభాషలు తెలిసినవారు, బహువిద్యావిశారదులు. సంస్కృతంలోనూ ద్వీపకల్పభాషలు తమిళం, కన్నడం, తెలుగు (వారి మాతృభాష), మరాఠీల్లోనూ పాండిత్యం గలవారు.

కాలక్రమంలో కావలి సోదరులు పండితులుగానూ, భారత దేశపు తొలి సర్వేయర్ జనరల్ కల్నల్ కాలిన్ మెకంజీ (క్రీ.శ. 1754–1821) దక్షిణ భారత దేశచరిత్ర, సంస్కృతుల నిర్మాణానికి ఆధారసామగ్రి సేకరణలో చేసిన అమూల్యమైన, అసమానమైన కృషికి సహాయకులు గానూ ప్రసిద్ధులయ్యారు.

ముగ్గురు కావలి సోదరులూ ఇంగ్లీషులో తొలితరం భారతీయ రచయితలు. అంతే కాదు, ప్రాచీన లిపి, శాసనలిపి, నాణాల శాస్త్రం, దేశపట లేఖనశాస్త్రం, ప్రాచీన ఆచార వ్యవహారాలు, వస్తుతత్త్వాలు, సాహిత్య, చారిత్రక అధ్యయనాలకు సంబంధించి విశిష్టమైన జ్ఞానంకలవారు.

## 2. రామస్వామి రచనలు

రామస్వామి బహుగ్రంథకర్త. సంస్కృతం, తెలుగు భాషల్లో మంచి పండితులు. ఇంగ్లీషులో ధారాళంగా రాయగలిగినవారు. అతనిది బలమైన కలం. అతని మేధాపరమైన కృషి, ఆసక్తులు కేవలం సాహిత్య, చారిత్రక అధ్యయనాలకు మాత్రమే పరిమితం కాలేదు. కింద సాధ్యమైనంతవరకు కాలక్రమంలో అతని రచనల పట్టికనిస్తున్నాం.

1. విశ్వగుణాదర్శం లేదా మిర్రర్ అఫ్ ముండేన్ క్వాలిటీస్ (కలకత్తా, 1825)

   వేంకటాధ్వరి సంస్కృత రచన 'విశ్వగుణాదర్శా'నికి ఇంగ్లీషు అనువాదం.)

   ఈ అనువాదానికి అనుబంధాలుగా రామస్వామి 'లైవ్స్ అఫ్ ది ఆళ్వార్స్', 'ఎ పొలిటికల్ హిస్టరీ ఆఫ్ ఆంధ్రదేశ' రాశాడు.
2. మ్యాప్ అఫ్ ఏన్సియంట్ డెక్కన్ (కలకత్తా, 1827)
3. డిస్క్రిప్టివ్ అండ్ హిస్టారికల్ స్కెచెస్ ఆఫ్ ది సిటీస్ అండ్ ప్లేసెస్ ఇన్ ది డెక్కన్ (కలకత్తా, 1828)
4. బయాగ్రాఫికల్ స్కెచెస్ ఆఫ్ ది డెక్కన్ పోయెట్స్ (కలకత్తా, 1829)
5. మూలికా సాంత్వనము (తెలుగు)

   'ధన్వంతరి' అనే సంస్కృత ఆయుర్వేద గ్రంథానికి తెలుగు అనువాదం. (మద్రాసు, 1835)
6. పాకశాస్త్ర అదర్వైజ్ కాల్డ్ సూపశాస్త్ర ఆర్ ది మోడర్న్ కులినరీ రిసైప్స్ ఆఫ్ ది హిందూస్ (మద్రాసు, 1836). సరస్వతీ బాయి అనే ఆవిడ రచించిన తెలుగు వంటల పుస్తకానికి ఇంగ్లీషు అనువాదం.